క్లుప్తంగా

మావుళ్లమ్మకు 12 గ్రాముల బంగారం సమర్పణ



మావుళ్లమ్మ అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న సత్యనారాయణ శెట్టి కుటుంబ సభ్యులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారికి సోమవారం బెంగుళూరుకి చెందిన బివి సత్యనారాయణ శెట్టి కుటుంబ సభ్యులు 12 గ్రాముల బంగారం సమర్పించారు. ఈసందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు వారిచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. బంగారం దాతలకు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న దాత కిరణ్ ప్రసాద్

ఉండి: ఆపదలో ఆదుకోవడమే మానవత్వమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు అన్నారు. ఉండిలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కాలకూరి రత్నానికి విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, రూ.3 వేలు ఆర్థిక సాయాన్ని దాత చేతుల మీదుగా అందించినట్లు సుబ్బారావు తెలిపారు. పలువురు నిరుపేదలకు కూడా నిత్యావసర వస్తువులను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం బ్రతికి ఇతరులను బ్రతికించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ మాస్టర్, రాయి సతీష్, యేడిత నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.

పాల్‌కు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కురెళ్ల పాలును పరామర్శిస్తున్న నేతలు

ఆకివీడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కురెళ్ల పాలును సోమవారం మండల వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు. కాలు విరిగి, మోకాలు చిప్ప పగిలిపోయి మంచాన పడిన పాలు త్వరగా కోలుకోవాలన్నారు. పరామర్శించిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు గుండా సుందర రామనాయుడు, జి.ధనరాజు, బొక్కా శ్రీనివాసరావు, లారీ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.వెంకట్రావు, తోట లక్ష్మణరావు పలువురున్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



వరద ఉధృతి దృష్ట్యా ఇసుక మూటలు సిద్ధం చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్ : లోతట్టు ప్రాంతాలలో వరద ఉధృతి దృష్ట్యా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులు అన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ప్రభావానికి నరసాపురం ప్రాంతంలో వ్యవసాయ భూములు, పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. సోమవారం కూడా చినుకులు, ఈదురుగాలులు తీరప్రాంతంలో నెలకొన్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమవ్వడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మండలంలోని ఆదివారం కురిసిన అధిక వర్షంతో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేశారు. కొత్త నవరసపురం ఎస్టీకాలనీలో ఇప్పటికే వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. వరద ఉధృతి దృష్ట్యా రెవెన్యూ సిబ్బంది నిరంతరం గస్తీ ఏర్పాటు చేశారు. అలాగే పాత నవరసపురం, లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, ధర్బరేవు, తదితర ప్రాంతాల్లో కూడా గోదావరి ఏటిగట్టు నిరంతరం పర్యవేక్షించుటకు రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఫంటు ప్రయాణాన్ని నిలుపుదల చేశారు.

దుర్గాలక్ష్మణేశ్వరుడికి ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు యలమంచిలి ప్రసాదశర్మ నేతృత్వంలో అర్చనలు నిర్వహించారు.

భయం గుప్పెట్లో ముంపు వాసులు



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మణ్



వెలివర్రు రోడ్డులో ముంపులోనే వరి పొలాలు

ముంపులోనే వరి పొలాలు

ఉండి: మండలంలో సోమవారం వర్షం కురవలేదు. కానీ ఉండి పంట కాలువ ఉధృతి మాత్రం తగ్గలేదు. దీంతో లోతట్టు ప్రజలు బిక్కుబిక్కు మంటున్నారు. ఉండి కాలువ, యండగండి, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం తదితర గ్రామాల్లో ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంది. ముఖ్యంగా యండగండి ప్రాంతంలో కాలువ వెంబడి మట్టి బస్తాలు కట్టినా వాటిపై నుంచి ప్రవహిస్తూ జగనన్న కాలనీ, ప్రధాన వంతెన సమీపంలోనూ గట్లు దాటి ప్రవహిస్తుంది. అలాగే ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీ, ఎస్సీ ఏరియాలోనూ, అలాగే ఉండి అక్విడెక్టు వద్ద పరిస్థితి ఇంకా ఇబ్బందిగానే ఉంది. దీంతో అధికారులు కాలువ, యనమదుర్రు డ్రెయిన్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఉండి ఎస్సై ఎం.లక్ష్మణ్ యనమదుర్రు, ఉండి కాలువలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఉండి అక్విడెక్టు వద్ద కాలువకు పడిన గండిని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అలాగే బొండాడ డ్రెయిన్ పక్కనే నివాసం ఉంటున్న కుటుంబాలు వరదనీటి తాకిడికి గురి కావడంతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందిగా ఉంటే బయటకు రావాలని సూచించారు. మండల వ్యాప్తంగా వరి పొలాలు మరో రోజు ముంపు నీటిలోనే ఉండిపోయాయి. డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించిపోవడంతో పొలాల్లో నీరు బయటకు వెళ్లే దారి లేక ముంపులోనే ఉన్నాయి. సోమవారం వర్షం ఆగిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఉండి ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లి పంట కాలువల్లో నీటి ప్రవాహాన్ని తగ్గించాలని కోరినట్లు రైతులు తెలిపారు.

కనీస వసతుల కోసం వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్ల కోడులోని కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని, వర్షపు ముంపు నీటిని బయటకు తోడించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కాలనీలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలన్నారు. రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిషనర్ జి.కృష్ణ మోహన్‌కు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, సందక సూరిబాబు, గేదల ధనుష్, బొడ్డుపల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన వాన...తొలగని ముంపు



1 వార్డు టిడ్కో ఇళ్ల ప్రాంతం వద్ద ముంపునీటిని ఇంజన్లతో బయటకు తోడుతున్న దృశ్యం



దుర్గాపురంలో ముంపునీటిని తోడుతున్న దృశ్యం

క్రమేపీ తగ్గుతున్న యనమదుర్రు డ్రెయిన్ వరద ఉధృతి

భీమవరం(ప్రకాశం చౌక్): ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలకు కాస్త విరామం వచ్చినా ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో పలు డ్రెయిన్లు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. సోమవారం చిరుజల్లులు మినహా వర్షం కురవకపోవడంతో ఊపిరిపీల్చుకున్న ప్రజలు డ్రెయిన్‌లు ఉగ్రరూపం దాలుస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. భీమవరం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన దుర్గాపురం, లంకపేట, చేపలమార్కెట్, 1 వార్డు టిడ్కో ఇళ్ల ప్రాంతాలు ముంపుకు గురైయ్యాయి. 12 ఆయిల్ ఇంజన్లు,7 ఎలక్ట్రికల్ ఇంజన్లు ద్వారా ముంపునీటిని తోడుతున్నారు. ముంపు ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్రమేపి తగ్గుతున్న యనమదుర్ర డ్రెయిన్ ఉధృతి: భీమవరం పట్టణంలో ప్రవహించే యనమదుర్రు డ్రెయిన్ వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆదివారం వరకు భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్ నీటి మట్టం 12.4 అడుగుల మేర పెరిగి ప్రవహించగా సోమవారం నాటికి క్రమేపి ఉధృత తగ్గి 11.9 అడుగుల మేర ఎత్తుల్లో ప్రవహిస్తుందని ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు ముందుచూపుతో యనమదుర్రు డ్రెయిన్ గట్లు శాశ్వతంగా పటిష్టం చేసే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బధిర పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

భీమవరం: పట్టణంలో వసుధ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం వెంకటేశ్వర బధిరుల పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు మాట్లాడుతూ బధిర విద్యార్థులు విద్యాసామర్థ్యాలు ఎక్కువగా కలిగి ఉంటారని, వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, బి వెంకటపతిరాజు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సైబర్ పోలీసుల విచారణ

ఆకివీడు: కర్ణాటక నుంచి సైబర్ పోలీసులు ఒక కేసు విషయమై ఆకివీడులో సోమవారం విచారణ చేపట్టారు. స్థానిక తెలగపాముల కులస్తుల ప్రాంతంలో విచారణ చేశారు. అనంతరం ఎస్ టర్నింగ్ వద్ద తెలగపాముల కులస్తుల యువతీ, యువకులను ఫోటోలు తీసుకున్నారు. విచారణ కోసం వచ్చిన పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బి.నాగబాబు అనుమతితో విచారణ చేపట్టారు.

నేడు లయన్స్ క్లబ్ సమావేశం

ఉండి: నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ సమావేశాన్ని ఉండి కూనపరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు తెలిపారు. ఈ సందర్భంగా హంగర్ ప్రోగ్రాం నిర్వహణ, సభ్యులకు పిన్స్ పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు.

కార్గో పార్సిళ్ల వేలం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్టీసీ కార్గోనందు ఎవరూ తీసుకువెళ్లని పార్సిళ్లను మంగళవారం ఉదయం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు జిల్లా కార్గో మేనేజర్ సుబ్బారావు తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం10 గంటలకు హాజరుకావాలని కోరారు.

రైల్వే గేటు మూసివేత

పాలకోడేరు: ఈ నెల 24, 25 తేదీల్లో కుముదవల్లి రైల్వే గేటును మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే గేటు వద్ద గల రోడ్ మరమ్మతుల దృష్ట్యా మూసి వేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించి, సహకరించాలని తెలిపారు. ఈ మేరకు కుముదవల్లి పంచాయతీకి, పాలకోడేరు మండల తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు.

ముంపు బాధితులకు ఆహార పొట్లాల అందజేత

భీమవరం: అన్నార్తులను, ముంపు బాధితులను ఆదుకోవడమే మానవ ధర్మమని ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, చెన్నమల చంద్రశేఖర్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం భీమవరం మెంటే వారితోటలోని వదర ముంపు బాధితులకు దాతలు వేగేశ్న రంగరాజు సహకారంతో ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలో భారీ వర్షాలు, వదర కారణంగా నిరాశ్రయులైన పేదలకు రెండు రోజులుగా దాతల సహకారంతో భోజనాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎద్దు ఏసుపాదం, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, తోట సురేష్, రాంబాబు, అడవి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



వరద ముంపు బాధితులకు భోజనం పొట్లాలు అందజేస్తున్న దృశ్యం

కొల్లేరుకు ఎర్ర 'కాలువ' నీరు

ఉప్పుటేరులో ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలువ నీరు



కొల్లేరులోని ఎర్ర కాలువ నీరు ఉప్పుటేరు గుండా సముద్రంలోకి వెళుతున్న దృశ్యం

ఆకివీడు: ఎర్ర కాలువ నీరు జిల్లాను ముంచెత్తుతోంది. పలు పంట కాలువలు, డ్రెయిన్లు, పంట పొలాల్లోకి ఎర్రకాలువ నీరు చొచ్చుకెళ్లింది. పది సంవత్సరాలుగా ఎర్ర కాలువ నీరు ఈ ప్రాంతంలోకి వచ్చిన దాఖలాలు లేవు. భారీ వరదలు వచ్చినప్పటికీ ఎర్రకాల్వ నీరు ఉధృతంగా రాలేదు. పంట కాలువల నుంచి ముంపు నీరు డ్రెయిన్ల ద్వారా కొల్లేరు సరస్సులో కలుస్తోంది. సరస్సులో అదనపు నీరు ఉప్పుటేరు గుండా సముద్రంలోకి ప్రవహిస్తోంది. యనమదుర్రు డ్రెయిన్ మొదట్లో నిడదవోలు వద్ద ఎర్ర కాలువ 37.6 అడుగుల నీటి మట్టం ఉంది. ఉధృతంగా ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్ నుంచి దువ్వ పంట కాలువలోకి నీటిని వదులుతున్నారు. దువ్వ లాకుల నుంచి వెంకయ్య వయ్యేరు, ఉండి ప్రధాన పంట కాలువలోకి వెళ్లి అక్కడి నుంచి మేజర్, మైనర్ డ్రెయిన్లు, పంట కాలువల్లోకి చొచ్చుకుపోతుంది. భారీ వర్షపు నీటితో ముంపు బెడదను ఎదుర్కొని కోలుకొంటున్న రైతాంగానికి పుండు మీద కారం చల్లినట్లు ఎర్ర కాలువ నీరు వదిలేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకుమడులను, నాట్లను రక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఎర్ర కాలువ నీటితో అవి పూర్తిగా కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడిందంటున్నారు. డెల్టా ప్రాంతంలో భారీ వర్షాలకు, వరదలకు, ఎర్ర కాలువ నీటికి నారుమడులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నారుమడులు, నాట్లు వేసిన రైతులకు వాటిల్లిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించామని వ్యవసాయాధికారి ప్రియాంక తెలిపారు.

నారుమడుల పరిశీలన

భీమవరం అర్బన్: వాయుగుండం కారణంగా వర్షాలు, యనమదుర్రు డ్రెయిన్ ఉధృతి కారణంగా వరి నారుమడుల్లో వరద నీరు నిలిచిపోతుందని, వరి నారుకు గాలి తగిలేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. యనమదుర్రు, తుందుర్రు, బేతపూడి, గునుపూడి, తాడేరు, గునుపూడి గ్రామాల్లో సోమవారం ఏఓ నిమ్మల శ్రీనివాస్ నారుమడులు, వరినాట్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి విత్తనం చల్లిన తర్వాత వారం రోజుల వరకు మడి ఆరబెట్టాలని 7 నుంచి 30 రోజుల మధ్యలో ఉన్న నారు 5 రోజులు మునిగితే పర్వాలేదని అంతకు మించితే కొత్త ఆకు రాకుండా వరినారు దెబ్బతింటుందన్నారు. వరదనీటిని తొలగించాక 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకుంటే కొత్త ఆకు వస్తుందని తెలిపారు.



బేతపూడిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో నిమ్మల శ్రీనివాస్

ముంచేసిన గోస్తనీ డ్రెయిన్

మునిగిన మోగల్లు పొలాలు

పాలకోడేరు: కోస్తాలో నదులు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తుండటంతో ఎక్కడికక్కడ కాలువల్లోని నీటి మట్టాలు పెరిగి భయపెడుతున్నాయి. ఆదివారం రాత్రి గోస్తనీ డ్రెయిన్‌కు డ్రైన్ కు గుత్తులవారి పాలెం వద్ద గండి పడింది.దాంతో అక్కడి పొలాలన్నీ వరదనీటి తో ముంచెత్తాయి.కాగా గుత్తులవారి పాలెం లోని పల్లపు ప్రాంతాలు కూడా వరద నీరు ముంచెత్తింది. దాంతో సమాచారం అందుకున్న అధికార బందం హుటాహుటిన ఇసుక బస్తాలు తో, జెసిబి లతో గండి ని పూడ్చే పనులు ప్రారంభించారు.అతి కష్టం మీద సోమవారం సాయంత్రానికి ఎట్టకేలకు గండి ని పూడ్చగలిగారు.





గుత్తులవారి పాలెం సమీపంలో గోస్తనీ డ్రెయిన్‌కు పడిన గండిని సిమెంట్ బస్తాలతో పూడుస్తున్న దృశ్యం

మోగల్లులో నీట మునిగిన వరి పొలాలు

ముంపునకు గురైన వరి చేలు

గోస్తనీ డ్రెయిన్‌కు గండి పడడంతో గుత్తులవారి పాలెం, మోగల్లు వరి పొలాలు సుమారు 450 ఎకరాల వరకు ముంపునకు గురయ్యాయని మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు తెలిపారు. వరి నాట్లు పూర్తయిన 20 ఎకరాలు, మిగతావి నారుమడులని తెలిపారు.

-ఏవో నారాయణరావు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వీరవాసరం: నీట మునిగిన పంటలను యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రక్షించుకోవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి బీన్సీ బాబు తెలిపారు. మండలంలో ముంపుకు గురైన పొలాలను ఆయన పరిశీలించారు. నారుమడి దశలో ఉంటే 5 సెంట్లు నారుమడికి 1 కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలని రైతులకు సూచించారు. పొలంలో అధికంగా ఉన్న నీటిని తొలగించి, పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులు బూస్టర్ డోస్‌గా వేయాలన్నారు. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో 2 శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్ పిచికారీ చేస్తే పైరు త్వరగా పుంజుకుంటుందని వివరించారు. తెగుళ్లు సోకకుండా కార్బండిజమ్ 1 గ్రాము లేదా మాకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉన్నాం

నరసాపురం: వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టాలు జరగకుండా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ ప్రజలకు ధైర్యం చెప్పారు. సోమవారం ఆర్డీవో నరసాపురం పట్టణం గోదావరి పరీవాహక ప్రాంతాలైన 1, 2, 3 వార్డుల్లో పర్యటించారు. పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ఏటిగట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో స్థానికులతో మాట్లాడారు. వర్షాలు తగ్గుముఖం పట్టినా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు కారణంగా వశిష్ట గోదావరి ఉగ్రరూపంలో ప్రవహిస్తోందని చెప్పారు. వరద పరిస్థితి మరింత ఎక్కువైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఇందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని సూచించారు. నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు, ఆయంట మండలాల్లో పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు వలలు, వేట పనిముట్లు భద్రపరచుకోవాలన్నారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్న చోట్ల యుద్ధ ప్రాతిపదికన పటిష్ట పరచాలని ఆదేశించారు. ఇసుక బస్తాలు, తడికెలు సిద్ధం చేయాలన్నారు. అవుట్‌పాల్ స్లూయిస్‌ల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని కన్జర్వెన్సీ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంట నరసాపురం తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఆర్ఐ కె.యశోద తదితరులు ఉన్నారు.

శాకంబరి అలంకరణలో ఉమాసోమేశ్వరస్వామి



వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకారంలో ఉమామహేశ్వరస్వామి

భీమవరం (పకాశం చౌక్): ఆషాడ మాసం సందర్భంగా పంచారామక్షేత్రంలో కొలువైన ఉమాసోమేశ్వకరస్వామిని సోమవారం శాకంబరి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అలాగే శ్రీచక్ర సహిత పార్వతి సమేత విరేశ్వర స్వామి శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో....

జువ్వలపాలెంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాడ మాసం శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ రామ్‌కుమార్ రాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారి రుద్రరాజు గంగాశ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.